సాక్షి పెద్దపల్లి

సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



చందనను ట్రాప్ చేశారా?

కోరుట్లలోని భీమునిదుబ్బలో ప్రియుడు ఉమర్ షేక్‌తో కలిసి చందన తన అక్క దీప్తిని సినీఫక్కీలో హత్యచేసిన కేసులో వెలుగులోకి వస్తున్న కోణాలు ఆసక్తి రేపుతున్నాయి. 8లో▸



ప్రభావిత గ్రామాల సంక్షేమమే ధ్యేయం

సింగరేణి ప్రభావిత గ్రామ ప్రజల సంక్షేమమే ధ్యేయమని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్య నారాయణ అన్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

యోగాతో ఒత్తిడి దూరం



యోగా చేస్తున్న మహిళలు, యువత

సుల్తానాబాద్‌రూరల్: యోగాతో ఒత్తిడి దూరం అవుతుందని, పైగా ఆరోగ్యంగా ఉంటామని పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్ అన్నారు. సుల్తానాబాద్ సర్కిల్ పోలీసు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఐ జగదీశ్ ఆధ్వర్యంలో యోగా గురువులు మహిళలు, యువత, వృద్ధులతో యోగాసనాలు వేయించారు. యాంత్రిక జీవనంలో ఒత్తిడి అధికమని, అలాంటి సమయంలో యోగా చేయాలని ఏసీపీ సూచించారు. పెద్దపల్లి సీఐ అనిల్‌కుమార్, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు విజేందర్, శ్రీనివాస్, శ్రీధర్, వెంకటకృష్ణ, సత్యనారాయణ, యోగా గురువులు సంపత్, ప్రభాకర్, శిక్షకురాలు ఆమని పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం



సుల్తానాబాద్‌లో కురుస్తున్న వర్షం

సుల్తానాబాద్ : వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆగస్టులో వర్షం అసలే కురవకపోవడంతో ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలను ఆశ్రయించారు. కొద్దిరోజులుగా వేసవికాలాన్ని తలపించిన వాతావరణం శనివారం నుంచి ఆదివారం రాత్రి వరకు కురిసిన వర్షం ప్రజలకు కాస్త ఊరటనిచ్చినట్లయ్యింది.


పెద్దపల్లిపై కాషాయ జెండా ఎగరేద్దాం



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ రాష్ట్ర నాయకులు ఠాగూర్ రాంసింగ్, పెద్దపెల్లి అసెంబ్లీ కన్వీనర్ పిన్నింటి రాజు, మొలుగూరి సాగర్, రామగిరి అఖిల్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఫహీం, పెండ్యాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



అమరవీరుల స్తూపం వద్ద ఉద్యమకారులు

పెద్దపల్లిరూరల్: ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం ఒక్కరోజు శాంతియుత రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు సాధించే వరకూ దశలవారీగా పోరాటాలు సాగిస్తామని నాయకులు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు నూనె రాజేశం, బత్తుల శంకర్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దెబ్బెట చంద్రకళ, ఎండీ.కతీజా, ఆలేటి ఎల్లమ్మ, బొసెల్లి శాంత, గనేవేన రాజేశ్వరి, సంటి నర్సమ్మ, లలితాఠాగూర్, ఎండీ.ఫాతిమా, రమాదేవి కొండ్ర లక్ష్మి, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. శ్రావణమాసం కావడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. పట్నాలు వేసి.. నైవేద్యం సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ పాలకవర్గం పర్యవేక్షించింది.

ఆరుతడి పంటలకు జీవం

- జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- నీటిని తోడేందుకు భారీ పంపుల ఏర్పాటు



కమాన్‌పూర్: వర్షం కురవడంతో కళకళలాడుతున్న పత్తి చేను



జ్యోతినగర్: వరద నీటితో మల్యాపూర్ రోడ్



మంథని: మున్సిపల్ కాంప్లెక్స్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో నిలిచిన వరద నీరు

గోదావరిఖని: శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రామగుండం రీజియన్‌లోని నాలుగు ఓసీపీల్లో ఆదివారం 3.80లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ పనులు నిలిచిపోయాయి. 45వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. వినియోగదారులకు స్టాక్‌యార్డులో నిల్వ ఉన్న బొగ్గును సరఫరా చేస్తున్నారు. జీడీకే–5 ఓసీపీలో 90క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయాయి. 9వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. హాలేజీ రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ఓసీపీ–3లో 1.70లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయాయి. 24వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. యంత్రాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఓసీపీ–1, 2లో 1.20లక్షల క్యూబిక్‌మీటర్ల ఓబీ పనులు, 12 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. 110 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. క్వారీలో ఆరుమీటర్ల మేర వరదనీరు చేరింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

జ్యోతినగర్: జోరువానకు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజీవ్ రహదారి నుంచి మల్కాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి వరద నీటిలో మునిగింది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. న్యూపోరట్‌పల్లి బ్రిడ్జిపై నుంచి వరదకాలువ పొంగి ప్రవహించింది. జంగాలపల్లె, కృష్ణానగర్‌లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది.

ఎలిగేడులో 40.2 మిల్లీమీటర్ల వర్షం

ఎలిగేడు: మండల వ్యాప్తంగా ఆదివారం 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు. వర్షంతో పత్తి, వరిపొలాలకు మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జూలపల్లిలో 25.2 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఊరటనిచ్చిన వర్షం

కమాన్‌పూర్: నెల రోజులుగా వర్షం కురవకపోవడంతో పత్తి పంటలు ఎండలకు వాడిపోయాయి. ఈ వర్షంతో ఆరుతడి పంటలకు మేలు జరిగిందని రైతులు చెబుతున్నారు.



పెద్దపల్లిలో కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు



గోదావరిఖని: నిలిచిపోయిన డంపర్లు

చెరువును తలపించిన మంథని ఆర్టీసీ బస్టాండ్



మంథని: మంథనిలో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మున్సిపాలిటీలో మురుగుకాల్వల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వరద నీరు రోడ్లపైనే ప్రవహించింది. పద్మశాలీ, సత్యసాయినగర్, గంగాపురిలో ఇళ్లలోకి వరద నీరు చేరి స్థానికులు ఇబ్బంది పడ్డారు. మున్సిపాలిటీ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాండ్ ముందు వరద నీరు భారీగా చేరింది. సత్యసాయినగర్‌లో మురుగు కాలువలో ప్రవాహం నిలిచిపోవడంతో చైర్‌పర్సన్ పుట్ట శైలజ సిబ్బందితో వచ్చి కాలువను శుభ్రం చేయించి నీటిని మళ్లించారు.

ఫ్లటూన్‌పంప్‌ల ద్వారా వాటర్‌పంపింగ్



ఓసీపీ క్వారీలోకి వరద చేరుతుండడంతో పంపులు మునిగిపోకుండా ఫ్లటూన్ పంపులు బిగించారు. వీటిద్వారా ఎప్పటికప్పుడు క్వారీలో చేరిన నీటిని పంపింగ్ చేస్తున్నారు. జీడీకే–5 ఓసీపీ పక్కనే డ్రైనేజీ కాలువ, ఓసీపీ–3 పక్కన జల్లారం వాగు, ఓసీపీ–1, 2 పక్కనే బొక్కలవాగు ఉండటంతో అధికారులు వరద ఉధృతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. యైటింక్లయిన్‌కాలనీలో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఫలితంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి.

అస్తవ్యస్తంగా ఎస్సారెస్పీ కాలువ

- నిండిపోయిన పిచ్చిమొక్కలు
- నామమాత్రంగా పొదల తొలగింపు
- పట్టించుకోని అధికారులు



బంజేరుపల్లి వద్ద డీ–83బీ కెనాల్‌లో పెరిగిన చెట్ల పొదలు

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ శివారు నుంచి వెల్గటూర్ మండలం వరకు విస్తరించిన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డీ–83 బీ కెనాల్ అస్తవ్యస్తంగా మారింది. కాల్వ ప్రారంభం నుంచి ధర్మారం శివారు వరకు కెనాల్‌లో పెద్దపెద్ద చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. నీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. వర్షకాలంలో కెనాల్ పైభాగం నుంచి వరదనీరు వెళ్లి గండ్లు పడుతుండేవి. దీంతో దాదాపు రెండు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం ఈ కెనాల్‌కు లైనింగ్ పనులు పూర్తి చేసింది. దీంతో పదేళ్ల వరకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కాల్వ చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందింది. అయితే పదేళ్లుగా కెనాల్ లైనింగ్ పైభాగంలో చెట్లు పెరిగి వృక్షాలుగా మారాయి. మరోవైపు విచ్చలవిడిగా పెరిగిన పిచ్చిమొక్కలు కాల్వలో నీటి సరఫరాకు అడ్డు తగులుతున్నాయి. చెట్ల కొమ్మల వద్ద నీటిలో కొట్టుకొచ్చిన చెత్తాచెదారం ఆగిపోయి నీటి సరఫరా నిలిచిపోతోంది. ఫలితంగా కాలువ లైనింగ్ సైతం బీటలుగా మారి గండ్లుగా ఏర్పడుతున్నాయి.

నామమాత్రంగా మరమ్మతు పనులు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డీ–83బీ కెనాల్‌కు ఇటీవల మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండాపనులు పూర్తిచేశారని రైతులు అంటున్నారు. రోడ్డుపై భాగంలో పోసిన మట్టి ఇష్టం వచ్చినట్లు పోయడంతో నిధులు దుర్వినియోగం అయినట్లు రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా కెనాల్ లైనింగ్ పైభాగంలో పెరిగిన చెట్లను పూర్తిస్థాయిలో తొలగించకుండా పని అయిపోయినట్లు చేస్తుండటంతో తిరిగి నెలరోజులకే ఆ చెట్లు వృక్షాలుగా మారే అవకాశాలున్నాయి. ఆయకట్టు చివరి రైతులకు సాగునీరందించేలా సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

చెట్లు తొలగించాలి



కెనాల్‌లో పెద్దపెద్ద చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి భయంకరంగా ఉంది. కెనాల్‌పై ఉన్న రోడ్డుపై వరకు చెట్లకొమ్మలు వచ్చి నీటి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ చెట్లతో కాల్వలోపోతున్న నీటికి అడ్డంగా మారుతోంది.

– బొమ్మనవేని కుమారస్వామి, రైతు, పెర్కపల్లి

నీటి సరఫరాకు అంతరాయం



కెనాల్‌లో పెరిగిన చెట్లు నీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. చివరి ఆయకట్టుకు నీరు చేరడం గగనంగా మారింది. చెట్ల పొదల్లో విషపాములు ఉంటున్నాయి. కొమ్మలకు చెత్త తట్టుకుంటోంది.

– సామంతుల కొమురయ్య, రైతు, కటికెనపల్లి

10న బీసీల సింహగర్జన

- విజయవంతం చేయాలన్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు
- మంథనిలో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పుట్ట మధు, తదితరులు

మంథని: సామాజిక న్యాయం, సబ్బండ వర్గాలకు రాజ్యాధికారమే ధ్యేయంగా నిర్వహించే బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆయన నివాసంలో బీసీల సింహగర్జన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఓటు మనదే సీటు మనదే నినాదంతో హైదరాబాద్ ఎల్బీనగర్‌లో బీసీ సంక్షేమ సంఘం, బీసీ కులాల జాయింట్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10న సింహగర్జన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బీసీలు, సబ్బండ వర్గాలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

స్వర్ణపల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి

మంథని మండలంలోని స్వర్ణపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని గ్రామస్తులు జెడ్పీ చైర్మన్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. గ్రామం నాగేపల్లి పరిధిలో ఏళ్ల తరబడి ఉంటోందని, ప్రత్యేక పంచాయతీ కాకపోవడంతో అభివృద్ధిలో వెనుకబడుతోందని పేర్కొన్నారు. నాగేపల్లి గ్రామపంచాయతీకి తమ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఇబ్బంది పడుతున్నామని, 500పైచిలుకు జనాభా ఉన్న తమ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఈనెల 19లోపు అభ్యంతరాల స్వీకరణ
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సుల్తానాబాద్‌రూరల్: యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, 18 ఏళ్లు నిండిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వలలో స్వీప్ (ఎస్‌డబ్ల్యూఈఈపీ) కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ముగ్గుల పోటీల కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రత్యేక ఓటరు క్యాంపును తనిఖీ చేసి ఓటరు జాబితాను పరిశీలించారు. అక్టోబర్ ఒకటి నాటికి 18 ఏళ్లు నిండే పౌరులకు ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుమోహన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ రమేష్‌గౌడ్, కార్యదర్శి సతీశ్, బూత్‌స్థాయి అధికారులున్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

పెద్దపల్లిరూరల్: బీఆర్‌ఎస్ పార్టీకి ఇవే ఆఖరు ఎన్నికలని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు పొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణరావు అన్నారు. పెద్దపల్లి మండలం భోజన్నపేటలో ఆదివారం గడపగడపకు విజ్ఞన్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివంగత సీఎం వైయస్సార్ పాలనలోనే రైతాంగానికి మేలు జరిగిందని గుర్తు చేశారు. ఒకేసారి రుణమాఫీ చేసిన ఘనత వైఎస్సార్‌దే అని కొనియాడారు. సీఎం కేసీఆర్ పాలన అవినీతిమయమని ఆరోపించారు. నాయకులు బుర్ర తిరుపతి, శంకర్, స్వామి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఊశన్నపల్లెకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాల్వశ్రీరాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చీర అజయ్, సందీప్, శ్రీకాంత్, శ్రీనివాస్, రాకేశ్, అశోక్, రాజ్‌కుమార్, విజయ్, రాజు, పవన్, శివ కుమార్, వంశీ, సతీశ్, అఖిల్, కార్తీక్, రంజిత్, సంపత్, రవి, లింగయ్య, మల్లయ్య, వెంకట్రాజం, మహేశ్, సదయ్య ఉన్నారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ అంక సదయ్య, మాజీ సర్పంచు సతీశ్, మాజీ ఎంపీటీసీ మొండయ్య పాల్గొన్నారు.



భోజన్నపేటలో ఇంటింటి ప్రచారంలో విజయరమణారావు

క్లుప్తంగా

ఆయన చూపు సజీవం


లింగస్వామి(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): ఆయన మరణించినా కళ్లు మాత్రం మరో ఇద్దరి దేహంలో సజీవంగా ఈ లోకాన్ని చూస్తూనే ఉన్నాయి. గోదావరిఖనిలో ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించి స్ఫూర్తిగా నిలిచారు ఇప్పలపల్లి లింగస్వామి(53) అనే జీన్స్ పాయింట్ స్పెషలిస్టు టైలర్. గోదావరిఖని శివాజీనగర్‌లో నివాసం ఉండే లింగస్వామి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందాడు. సమాజ హితం కోసం నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చెయ్యాలని లింగస్వామి కుటుంబ సభ్యులకు బంధువులు, స్నేహితులు నర్సయ్య, గట్ల వెంకట్, బంగారు రాజేశ్వర్‌రావు, మెరుగు చంద్రశేఖర్, సోమాదుల గౌరి, కుమార్ కౌన్సెలింగ్ చేశారు. దీంతో దుఃఖంలో కూడా నేత్రాలను దానం చెయ్యడానికి మృతుని తండ్రి లస్మయ్య, భార్య పద్మ, కుమారుడు శివకుమార్, కూతురు శివాణి ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా శనివారం రాత్రి నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి మడక గ్రామానికి చెందిన గట్టు శ్రీవాణి ఇంట్లో దొంగలు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాలు.. గట్టు మురళీకృష్ణ, శ్రీవాణి కరీంనగర్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేనిది చూసి దొంగలు గడ్డపారతో తాళం పగులగొట్టారు. బీరువాలోని వస్తువులను చిందరవందర చేసి రూ.10వేలతో పాటు వెండిపట్టీలు ఎత్తుకెళ్లారు. శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి


వంశీరెడ్డి (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీలకుంట గ్రామానికి చెందిన కంది వంశీరెడ్డి (23) పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. వంశీరెడ్డి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం ఈనెల 2న తండ్రితో గొడవపడ్డాడు. తర్వాత పురుగులమందు తాగగా చికిత్సకోసం సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి సమ్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చందనను ట్రాప్ చేశారా?

- నగలు, నగదు కోసమే హతమార్చారా?
- చడీచప్పుడు కాకుండా వెళ్తే హత్య జరిగేది కాదా?
- దీప్తి హత్యోదంతంపై అనేక అనుమానాలు


శ్రీనివాస్‌రెడ్డి నివాసం

కోరుట్ల: ఇంట్లో నగలు, నగదు ఉన్న సమయంలోనే ప్రియుడితో కలిసి పరార్ కావాలన్న ఆలోచన చందనకు ఎవరు కల్పించారు? ఈ దిశలో ఆమెను ఎవరైనా గైడ్ చేశారా? ప్రేమ మోజులో ఆ యువతి వారి ట్రాప్‌లో పడిపోయిందా? ప్రియుడితో కలిసి వెళ్లకుండా అడ్డుకున్న అక్కను చివరకు హతమార్చే పరిస్థితికి దిగజారిందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతనెల 29 వేకువజామున పట్టణంలోని భీమునిదుబ్బలో ప్రియుడు ఉమర్ షేక్‌తో కలిసి చందన తన అక్క దీప్తిని సినీఫక్కీలో హత్యచేసిన కేసులో వెలుగులోకి వస్తున్న కోణాలు ఆసక్తి రేపుతున్నాయి.

నాలుగేళ్ల పరిచయం..

- 2019లో చందన బీటెక్ చదవడం కోసం హైదరాబాద్ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో చేరింది.
- తన కంటే ఒక ఏడాది సీనియర్ ఉమర్ షేక్ సుల్తాన్ డిటెయిన్ కావడంతో చందనకు పరిచయం అయ్యాడు.
- అప్పటినుంచి వీరి ప్రేమాయణం సాగుతున్నట్లు సమాచారం.
- హాస్టల్‌లో ఉంటూ చందన తరచూ ఉమర్ షేక్ సుల్తానా ఇంటికి వెళ్లివస్తుండేదని తెలిసింది.
- ఈక్రమంలో వీరి ప్రేమ వ్యవహారం కొన్నాళ్లకు దీప్తికి తెలిసింది.
- ఆ తర్వాత ఇంట్లోనూ అందరికీ తెలిసి గొడవలు జరిగినట్లు సమాచారం.
- దీంతో చందన తండ్రి శ్రీనివాస్‌రెడ్డి తన కూతుళ్లు దీప్తి, చందనకు వివాహాలు చేయాలని సన్నాహాలు ప్రారంభించారు.
- ఆయన ఆంధ్రాకు చెందిన వ్యక్తి కావడంతో అక్కడే సంబంధాలు చూస్తున్నారు.
- పెళ్లి చేసుకోవాలని ఇంట్లో పెరుగుతున్న ఒత్తిడి గురించి చందన తన ప్రియుడికి చెప్పినట్లు సమాచారం.
- అయితే, 'మనకు జాబ్ లేదు.. ఎలాబతుకుతాం' అని డబ్బు, నగలు తీసుకొచ్చేలా ఉమర్ షేక్.. చందన దృష్టి మళ్లించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రేమా..

గతనెల 28వ తేదీన ఉదయం హైదరాబాద్ నుంచి కోరుట్లకు బయలుదేరిన విషయాన్ని ఉమర్ షేక్ తన తల్లి ఆలియా, చెల్లె ఫాతిమాకు చెప్పినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అయితే, ఆ యువకుడు, అతడి కుటుంబానికి చందనపై కేవలం ప్రేమ మాత్రమే ఉండి ఉంటే నగలు, డబ్బు అవసరం లేదని చెప్పి ఉండవచ్చు కదా? అనే సందేహాలు వేధిస్తున్నాయి. సోమవారం రాత్రి దీప్తి మద్యం మత్తులో ఉన్న సమయంలో చందన, ఉమర్ కలిసి నగలు, డబ్బు సర్దే పనిచేయకుండా చడీచప్పుడు కాకుండా పరారై ఉంటే.. దీప్తి హత్యకు ఆస్కారం ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమర్ షేక్ తల్లి గతంలో లెక్చరర్‌గా పనిచేసినట్లు సమాచారం. విద్యాధికులైన ఉమర్ షేక్ కుటుంబీకులు.. చందన, ఉమర్ కలిసి మంగళవారం నగలు, డబ్బులతో కారులో హైదరాబాద్ చేరుకోగానే.. ఇది తప్పని చెప్పి పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. అంతేకాకుండా అంతాకలిసి నగలు, డబ్బులతో తప్పించుకునే ప్రయత్నం చేయడం.. చందనను గుర్తుపట్టకుండా బుర్కా వేసి కారులో తీసుకెళ్లడం.. టోల్‌గేట్లకు చిక్కకుండా అడ్డదారుల్లో పయనించడం.. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిందన్న అభిప్రాయాలకు ఊతమిస్తోంది.

రిమాండ్‌కు నిందితులు..

దీప్తి హత్య, డబ్బులు, నగలు ఎత్తుకెళ్లిన కేసులో నిందితులు బంక చందన, ఆమె ప్రియుడు ఉమర్‌షేక్ సుల్తానా, ఇతడి తల్లి ఆలియా, చెల్లి ఫాతిమాతోపాటు బంధువు హఫీజ్‌ను ఆదివారం మధ్యాహ్నం జడ్జి వద్ద పోలీసులు హాజరుపరిచారు. జడ్జి ఆదేశాల మేరకు 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిందితులపై ఐపీసీ 302, 201, 120(బీ),380 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

నా బిడ్డను ట్రాప్ చేసింన్రు



నా బిడ్డ చందనను ఉమర్ ఫ్యామిలీ ట్రాప్ చేసింది. కొంత కాలంగా ఉమర్ కుటుంబ సభ్యులతో నా బిడ్డ టచ్‌లో ఉన్న విషయం నాకు తెలియదు. తెలిస్తే వెంటనే కట్టడి చేసేవాన్ని. ఉమర్ ఫ్యామిలీ చందనకు బ్రెయిన్‌వాష్ చేసింన్రు. నగలు, డబ్బులు కోసం ప్లాన్ చేసింన్రు. నిజంగా నా బిడ్డపై ప్రేమ ఉంటే నగదు, నగలు ఎందుకు ఎత్తుకెళ్లారు? నా బిడ్డతో తప్పుడు వాయిస్ మెసేజ్ పంపించి నా పెద్దబిడ్డ దీప్తిని బద్నాం చేసేందుకు యత్నించారు. దీప్తి కనీసం ఇంట్లో చాయ్ కూడా తాగదు. అలాంటిది వొడ్కా తాగిందని చందన చేత ఉమర్ ఫ్యామిలీ వాయిస్ మెసేజ్‌లో చెప్పించింది. ఇదంతా తప్పు. ప్రేమ పేరిట చందనను ట్రాప్ చేసి దీప్తి చావుకు కారణమైన వాళ్లకు కఠిన శిక్ష పడాలి.

– శ్రీనివాస్‌రెడ్డి,
దీప్తి, చందన తండ్రి

వరదనీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు


బస్సును ఒడ్డుకు చేర్చుతున్న పోలీసులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖనిలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి భూపాలపల్లి నుంచి ఖనికి వస్తున్న ఆర్టీసీ బస్సు స్థానిక ఫైవింక్లయిన్ మోరీ ప్రధాన రహదారి వరద నీటిలో చిక్కుకుంది. వెంటనే స్పందించిన గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, అగ్నిమాపక సిబ్బంది కలిసి బస్సును వరదలో నుంచి ఒడ్డుకు చేర్చారు. బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు.

ఫైవింక్లయిన్ మోరీ వద్ద నిలిచిన రాకపోకలు


నీటిలో మునిగిన ఫైవింక్లయిన్ రహదారి

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని ఫైవింక్లయిన్ మోరీ ఆదివారం కురిసిన భారీ వర్షానికి పొంగి పొర్లింది. ప్రధాన రహదారి పూర్తిగా మునిగిపోవడంతో గోదావరిఖని పట్టణం నుంచి యైటింక్లయిన్‌కాలనీకి వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకున్న నాథుడు లేడని వాహనదారులు వాపోతున్నారు. ఏటా వర్షాకాలం ఇదే తంతు అంటూ ఏరియా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బిల్లుల కోసం లబ్ధిదారుల నిరసన


నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

చొప్పదండి: మండలంలోని రాగంపేట గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించుకున్న లబ్ధిదారులకు మూడేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆదివారం గ్రామంలోని పోస్టు డబ్బా వద్ద ఉత్తరాలతో నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్‌కు పోస్టు ద్వారా ఉత్తరాలు పంపించారు. గ్రామానికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవడంలో వంద శాతం ప్రతిభను చూసి అవార్డు ఇచ్చారని, తమకు బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని వాపోయారు. ఇంకుడు గుంతల విభాగంలో తమ గ్రామం 2020లో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ గ్రామంగా అవార్డు పొందిందని, తమకు మాత్రం బిల్లుల చెల్లింపులో మొండిచేయి చూపుతున్నారని ఆరోపించారు. గ్రామంలో 400 మంది తమ ఇండ్లలో ఇంకుడు గుంతలను నిర్మించుకున్నారని, ఇంకా 100 పైగా గృహాలకు ఇంకుడు గుంతల బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఆందోళనకు మద్దతు తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాన్- కారు ఢీ.. ఆరుగురికి గాయాలు



మానకొండూర్: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్రగాయాలైనాయి. పోలీసుల వివరాలు.. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన కొందరు ఆదివారం హన్మకొండలో జరిగే వివాహ వేడుకకు కారులో బయలుదేరారు. మానకొండూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో కరీంనగర్- వరంగల్ ప్రధాన రహదారిపై వ్యాన్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ ఆకుదాడి కిరణ్, ఆకుదాడి చరణ్, జోగురు మల్లేశ్, జోగురు చంద్రమొగిలి, జోగురు కళ్యాణి, జోగురు ఆదిదేవ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీసీసీ ప్రచార కమిటీలో 'కోట'కు చోటు


శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన కోట శ్రీనివాస్‌కు పీసీసీ ప్రచార కమిటీలో రాష్ట్ర కార్యనిర్వాహకుడిగా అవకాశం కల్పిస్తూ ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఉస్మానియా విద్యార్థి సంఘ నాయకుడిగా ప్రజా ఉద్యమాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న కోట శ్రీనివాస్‌కు రాష్ట్ర కమిటీలో అవకాశం దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, ఏఐసీసీ కార్యదర్శి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగుపాటుకు మహిళకు గాయాలు

గోదావరిఖని(రామగుండం): పిడుగుపాటుకు మహిళకు గాయాలయ్యాయి. భారీ వర్షంతో పాటు పిడుగు పడటంతో స్థానిక ఫైవింక్లయిన్ చౌరస్తా ప్రాంతంలో బజ్జీలు విక్రయించే లక్ష్మికి గాయాలయ్యాయి. చలిపిడుగు పడటంతో వణికిపోయిన లక్ష్మిపై పక్కనే కాగుతున్న వేడినూనె మీదపడి గాయాలపాలయింది. సుమారు 40శాతం గాయాలతో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో చికిత్స వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అలాగే పిడుగుపాటుకు టీవీలు, సెటాప్ బాక్సులు కాలిపోయాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జమ్మికుంట(చొప్పదండి): కిరోసిన్‌తో నిప్పు అంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కందుకూరి రమాదేవి(45) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. రమాదేవి పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో తల్లి సుగుణ ఇంట్లో ఉంటోంది. భర్త రామమూర్తి ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గత నెల 16న తల్లి బంధువుల ఇంటికి వెళ్లగా రమాదేవి కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. రమాదేవి మానసిక స్థితి బాగలేక ఆత్మహత్యకు పాల్పడిందని భర్త ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవి తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

ప్రభావిత గ్రామాల సంక్షేమమే ధ్యేయం

- ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ



మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ప్రభావిత గ్రామ ప్రజల సంక్షేమమే ధ్యేయమని ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పరిసర ప్రభావిత గ్రామాల ప్రజల సంక్షేమం కోసం తాగు నీరు, బోర్ వెల్స్, రోడ్లు, సోలార్ లైట్స్, ఆర్వో ప్లాంట్స్ ఏర్పాటుతో పాటు పంట పొలాలకు సాగు నీరు అందించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సింగరేణి సూపర్ స్పెషాలిటీ వైద్యుల బృందంచే అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనరల్ ఫిజీషియన్, సర్జన్, ఎముకల వైద్యులు, స్త్రీల వైద్య నిపుణులు, చాతి, చెవి, ముక్కు, గొంతు, చర్మ, కంటి తదితర వైద్యులచే ఈసీజీ, ల్యాబ్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్ర మంలో డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, డివిజన్ కార్పొరేటర్ తాళ్ల అమృత రాజయ్య, అధికారుల సంఘం నాయకులు, పర్యావరణ అధికారి సురేశ్‌బాబు, డాక్టర్ కిరణ్‌రాజ్, వకీల్‌పల్లి గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్జీ–2 ఎస్‌ఓటు జీఎం సలీం తదితరులు పాల్గొన్నారు.

మభ్యపెట్టే విధానాలు మానుకోవాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): వేజ్‌బోర్డు ఏరియర్స్ విషయంలో కార్మికులను మభ్యపెట్టే విధానాలను మానుకోవాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. బొగ్గు గనుల చరిత్రలో మొదటి వేజ్‌బోర్డ్ నుంచి 10వ వేజ్‌బోర్డ్ వరకు ఏరియర్స్ సింగరేణి కార్మికులకు ఇచ్చిన తర్వాతే కోల్ ఇండియా కార్మికులకు ఇచ్చారన్నారు. కోలిండియా కార్మికులకు రెండు లేదా మూడు వాయిదాల్లో ఏరియర్స్ చెల్లించిన సందర్భాలు ఉన్నాయని, సింగరేణి కార్మికులకు మాత్రం ఒకే దఫాలో చెల్లించారన్నారు. 11వ వేతన ఒప్పందం ఏరియర్స్ చెల్లింపులో మాత్రం సింగరేణి వెనకబడిందని పేర్కొన్నారు. 23 నెలల ఏరియర్స్ చెల్లించేందుకు సర్క్యులర్ జారీ చేసిన వెంటనే ఆగస్టు జీతంతో సెప్టెంబర్ 3న కోలిండియా కార్మికులతో పాటు సింగరేణి కార్మికులకు కూడా చెల్లించేలా సర్క్యులర్ జారీ చేశారన్నారు. అయితే దీనిపై సింగరేణి యాజమాన్యం జాప్యం చేస్తోందన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.32,830కోట్లు టర్నోవర్ వచ్చిందని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ప్రకటించిన సింగరేణి యాజమాన్యం, అత్యధికంగా లాభాలు గడించిందన్నారు. కానీ సింగరేణి సంస్థలో ఏరియర్స్ చెల్లించడానికి ఇప్పటివరకు స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన విద్యుత్, బొగ్గు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ఒకే దఫా వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించాలని కోరారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఏరియర్స్ చెల్లింపుల్లో యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. అన్ని వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లింపుల్లో సింగరేణి ముందుంటే ఈసారి మాత్రం వెనకపడిందని విమర్శించారు. కార్మికులకు ఏరియర్స్ ఇచ్చే తేదీలు ప్రకటించకుండా రెండు వాయిదాల్లో ఇస్తామని ప్రకటించటం వెనుక పోరాటాలను నీరుకార్చడమే అన్నారు. ఏరియర్స్, లాభాల్లో వాటా ఒకేసారి ఇస్తే ఒక్కో కార్మికుడికి సుమారు రూ.5లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వస్తాయని, ఒకేసారి చెల్లిస్తే ఉపయోగం ఉంటుందన్నారు. జెన్కోకు అమ్మిన బొగ్గుకు సుమారు రూ.12వేల కోట్లు, జైపూర్ పవర్ ప్లాంట్ ట్రాన్స్కోకు సుమారు రూ.17 వేల కోట్లు, మొత్తం రూ.29 వేల కోట్లు సింగరేణికి రావాల్సి ఉందన్నారు. ఈసొమ్మును రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్నది నిజం కాదా ప్రశ్నించారు. సింగరేణి నష్టాల్లో ఉండి బీఐఎఫ్‌ఆర్‌లోకి పోయినప్పుడు కూడా ఏరియర్స్‌ను కోలిండియా కంటే ముందే ఒకే దఫాలో కార్మికులు తీసుకున్నారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం ద్వారా ప్రకటన ఇప్పించి, రాత్రికి రాత్రి కార్మికుల ఖాతాలో వేసి రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల లబ్ధి చేకూర్చడానికే మేనేజ్‌మెంట్ ఏరియర్స్ ఇచ్చేందుకు వాయిదా వేస్తుందనే విషయం వాస్తవం కాదా అని అన్నారు. ఏరియర్స్, లాభాల్లో వాటా ఒకేసారి ఇవ్వాలన్నారు. లేకుంటే సమ్మెకు వెనకాడబోమని పేర్కొన్నారు.

ప్రాణాలు తీసిన అప్పులు

- క్రిమిసంహారక మందుతాగి రైతు, ఉరేసుకొని కౌలు రైతు బలవన్మరణం


కుమార్ (ఫైల్)


రాజు మృతదేహం

రామడుగు(చొప్పదండి)/జమ్మికుంట(హుజూరాబాద్): అప్పుల బాధతో మనస్తాపం చెందిన యువ రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రామడుగు మండలం దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు వెల్మల కుమార్(34) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. కుమార్ తనకున్న రెండెకరాలతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, వరి పంటలు సాగు చేశాడు. గతంలో కురిసిన వడగండ్ల వర్షంతో వరి పంటకు పూర్తిగా నష్టం వాటిల్లింది. రెండేళ్ల క్రితం అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాడు. వ్యవసాయంతో పాటు ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.7 లక్షల మేర అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 1న రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య భూమిక, కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విలాసాగర్‌లో కౌలు రైతు..

జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన కౌలు రైతు గరిగంటి రాజు(34) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజు, రజిత దంపతులు కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. గతేడాది ఒక ఎకరం భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. పంట పండకపోగా రూ.2లక్షల వరకు అప్పులు అయ్యాయి. రాఖీ పండుగ సందర్భంగా భార్య తల్లిగారింటికి వెళ్లింది. ఈక్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాజు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

సార్లూ.. రక్షణ చర్యలు చేపట్టరూ..




రచ్చపల్లి శివారులో రహదారికి ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావులు



రహదారుల పక్కనే ఉన్న వ్యవసాయ బావులు కొన్ని సందర్భాల్లో మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. అయితే ఘటనలు జరిగితేనే హడావిడి చేసే అధికారులు ముందస్తుగా వాటిని గుర్తించి రక్షణ చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు. పెద్దపల్లి నుంచి ధర్మారం, దొంగతుర్తి నుంచి రచ్చపల్లికి వెళ్లే రహదారుల వెంట అనేక వ్యవసాయ బావులు మృత్యు కుహరాలను తలపిస్తున్నాయి. ఇంకా జిల్లా వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి